క్లుప్తంగా

బార్ కౌన్సిల్ క్యాలెండర్లు ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

భద్రాచలం: బార్ కౌన్సిల్ 2023 సంవత్సరపు క్యాలెండర్లను భద్రాచలం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ నీలిమ మంగళవారం ఆవిష్కరించారు. హైకోర్టు బార్ కౌన్సిల్ సభ్యులు దుస్సా జనార్ధన్, న్యాయవాదులు పేరాల నాగరాజు, అవులూరి సత్యనారాయణ, పడిసిరి శ్రీనివాస రావు, కొత్తపల్లి రాంబాబు పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ ఉపాధ్యక్షురాలిగా ఝాన్సీ



మణుగూరు రూరల్: భారతీయ జనతా పార్టీ పట్టణ ఉపాధ్యక్షురాలిగా గడ్డం ఝాన్సీ నియమితుల య్యారు. ఈ మేరకు ఆమెకు నియామకపత్రాన్ని పార్టీ పట్టణ అధ్యక్షులు లింగంపల్లి రమేష్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

సత్తా చాటిన గురుకుల విద్యార్థి



గణేష్

దమ్మపేట: జేఈఈ మెయిన్ ఫలితాలలో దమ్మపేటలోని గల గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులు సత్తాను చాటారని ప్రిన్సిపాల్ శ్యామ్‌కుమార్ తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి తేజావత్ గణేష్ 92.3 పర్సంటేజ్‌తో ప్రతిభ చూపాడన్నారు.

వెంకట్రావుకు పరామర్శ

భద్రాచలం: ఇటీవల గుండె సంబంధిత చికిత్స చేయించుకుని భద్రాచలం వచ్చిన బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ తెల్లం వెంకట్రావును మంగళవారం సీపీఎం నాయకులు పరామర్శించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు, నాయకులు ఎం.బీ.నర్సారెడ్డి, గడ్డం స్వామి, ఎం.రేణుక, సున్నం గంగ, బండారు శరత్‌బాబు, వై.వెంకట రామారావు, పి.సంతోష్‌కుమార్, ఎస్‌డీ.ఫిరోజ్ పరామర్శించిన వారిలో ఉన్నారు. డీవైఎఫ్‌ఐ నాయకుడు ఉస్తేల విశాక్ వర్ధంతి సందర్భంగా సీపీఎం నాయకులు నివాళులర్పించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మణుగూరుటౌన్: మండల కేంద్రంలోని బండారుగూడెం టౌన్-2 ఫీడర్ పరిధిలోని లైన్ల మరమ్మతులు, చెట్ల నరికివేత వంటి కార్యక్రమాల్లో భాగంగా నేడు విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని ఏఈ వేణుగోపాల్ తెలిపారు. ఫీడర్ పరిధిలోని బండారుగూడెం మెయిన్‌రోడ్డ, దుర్గాదేవి టెంపుల్, స్ప్రింగ్ హాస్పిటల్, శ్వేతా మెడికల్ షాపు, శ్రీ శ్రీనగర్, వినాయకనగర్ తదితర పలు ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

పనులు అడ్డుకున్నారని ఫిర్యాదు

ములకలపల్లి : మామిడితోటలో కరెంట్ లైను పనులు చేస్తుండగా అడ్డుకుని బెదిరించిన వారిపై బాధితుడు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం మేరకు.. పాత పాల్వంచకు చెందిన ఎండీ.రఫీయుద్దీన్‌కు మండలపరిధిలోని సీతారాంపురం గ్రామశివారులో ఉన్న పదెకరాల మామిడితోట తోట ఉంది. తోటలో సోమవారం విద్యుత్ లైను ఏర్పాటుకు స్తంభాలు వేస్తుండగా, కొందరు వ్యక్తులు అక్రమంగా తోటలోకి ప్రవేశించి పనులను అడ్డుకొని, బెదిరింపులకు పాల్పడ్డారు. ఈఘటనపై మంగళవారం రఫీయుద్దీన్ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తిరుమలరావు తెలిపారు.

వాలీబాల్ కిట్ అందజేత

మణుగూరు రూరల్: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని కొండాపురం క్రీడాకారులకు రేగా విష్ణు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం వాలీబాల్ కిట్‌ను బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అడపా అప్పారావు అందజేశారు. వెంకటరెడ్డి, నియోజకవర్గ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.రవిప్రసాద్, ప్రధాన కార్యదర్శి రమేష్, విక్రమ్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: మండల పరిధిలోని ఆనందాపురం, బీజీకొత్తూరు, చింతిర్యాల, చింతిర్యాల కాలనీ, సంద్రలబోడు గ్రామాల్లో రేగా విష్ణు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కోడి అమరేందర్ ఆధ్వర్యంలో వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. సర్పంచ్‌లు పాయం భద్రయ్య, కుంజా రామారావు, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్నా అశోక్‌కుమార్, సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి, ముత్యాల నరసింహారావు, తూము చీన రాఘవులు పాల్గొన్నారు.

మూడు జేసీబీలు.. ఆరు టిప్పర్లుగా!

ఇష్టారాజ్యంగా 'సీతారామ' కాల్వల మట్టి తోలకాలు

- రాత్రివేళల్లోనే దందా
- ఇబ్బంది పడుతున్న స్థానికులు



కాల్వల మట్టిని యంత్రాలతో తరలిస్తున్న దృశ్యం

బూర్గంపాడు: మండలంలో రోజు వందలాది లారీల మట్టిని ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారు. సీతారామ ప్రాజెక్ట్ కాలువల నుంచి తవ్విన మట్టితో అక్రమంగా కోట్ల రూపాయల వ్యాపారం సాగుతోంది. మూడేళ్లుగా కొంత గుట్టుగా సాగిన మట్టి అక్రమ వ్యాపారం ఇప్పుడు విచ్చలవిడిగా మారింది. జేసీబీలు, టిప్పర్లతో అక్రమ మట్టి వ్యాపారం మూడు పూలు, ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. కేవలం సీతారామ ప్రాజెక్ట్ మట్టిని అక్రమంగా అమ్ముకునేందుకే జేసీబీలు, టిప్పర్లు కొనుగోలు చేస్తున్నారంటే ఈ అక్రమ వ్యాపారం ఏ స్థాయిలో నడుస్తుందో అర్థమవుతుంది. బూర్గంపాడు మండలంలోని నకిరిపేట, లక్ష్మీపురం, అంజనాపురం, జింకలగూడెం గ్రామాలకు సమీపంలోని సీతారామా కాల్వల మట్టిని కొందరు వ్యక్తులు సొమ్ము చేసుకుంటున్నారు. తొలుత సీతారామ కాలువల మట్టిని ప్రభుత్వ అభివృద్ధి పనులకు అధికార అనుమతులతో తరలించారు. తరువాత మట్టిని రాత్రివేళల్లో అక్రమంగా తరలిస్తు అక్రమ వ్యాపారానికి కొందరు తెరతీశారు. ఇప్పుడు ఈ అక్రమదందా విచ్చలవిడిగా ఇష్టారాజ్యంగా మారింది. బూర్గంపాడు, భద్రాచలం, పాల్వంచ, మణుగూరు పారిశ్రామిక ప్రాంతాలకు సీతారామా కాల్వల మట్టిని అక్రమంగా తరలిస్తూ మట్టి మాఫియా కోట్ల రూపాయల ప్రభుత్వ ధనానికి గండికొడుతున్నారు. ఈ అక్రమ వ్యవహారంలో సీతారామ ప్రాజెక్ట్ ఇంజనీరింగ్ అధికారుల ఉదాసీన వైఖరిపై కూడా విమర్శలు వినిపిస్తున్నాయి.

దుమ్ముధూళితో నిండుతున్న ఇళ్లు..

ప్రతీరోజు రాత్రి 10గంటల నుంచి తెల్లవారుజామున 5 వరకు ఈ అక్రమ మట్టిదందా యథేచ్ఛగా సాగుతోంది. బూర్గంపాడు, అశ్వాపురం మండలాల్లో సుమారు 15 కిలోమీటర్ల పరిధిలోని సీతారామ కాల్వల మట్టిని దొరికిన చోట దొరికినట్లుగా ఎత్తుకెళ్తున్నారు. రాత్రివేళల్లో మట్టి లారీల రాకపోకలతో సీతారామ ప్రాజెక్ట్ కాల్వల పరిసర గ్రామాలలోని నిద్ర ఉండటంతో లేదని, లారీల రాకపోకలతో రహదారులు దెబ్బతింటున్నాయని స్థానికులు వాపోతున్నారు. రోడ్ల పక్కన ఇళ్లు దుమ్ముధూళితో నిండిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కఠిన చర్యలు లేకపోవడమే వరంగా..

అప్పుడప్పుడు అధికారులు అక్రమ దందాను అడ్డుకున్నప్పటికీ కఠినచర్యలు ఉండకపోవటంతో అక్రమార్కులకు వరంగా మారింది. అప్పుడప్పుడు లారీలను, జేసీబీలను పట్టుకున్న అధికారులు జరిమానాతో వదిలేస్తున్నారు. కోట్ల రూపాయల మట్టి అక్రమ వ్యాపారంలో జరిమానాలు నామమాత్రంగా మారాయి. తొలుత ఒక లారీ మట్టిని రూ.2 వేలకు విక్రయించారు. ఇప్పుడు లారీ మట్టి ధరను రూ 4వేల నుంచి రూ 5 వేల వరకు పెంచారు. పారిశ్రామిక ప్రాంతాల్లో మట్టి అవసరాలు ఎక్కువగా ఉండటంతో మట్టికి మంచి డిమాండ్ ఏర్పడింది. ఎన్ని ఆరోపణలు, ఫిర్యాదులు అందుతున్న అధికార యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరిస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు నిఘా పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మట్టి లారీలతో ప్రమాదాలు

రాత్రివేళలో అతివేగంగా వస్తున్న మట్టి లారీలతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మట్టి లారీల మోతతో రాత్రివేళలో నిద్ర ఉండటం లేదు.మట్టి దందాకు పాల్పడుతున్న వ్యక్తులతో అధికారులు కుమ్మక్కయ్యారు. యథేచ్ఛగా మట్టిని అక్రమంగా తరలిస్తున్న ఎలాంటి చర్యలు ఉండటం లేదు. ఇప్పటికైనా అధికారులు మట్టి అక్రమ రవాణాపై దృష్టి పెట్టాలి.

– డి.పున్నంచంద్, బూర్గంపాడు

అధికారులు దృష్టి సారించాలి

సీతారామ కాల్వల మట్టి అక్రమ రవాణాపై అధికారులు నిఘా పెట్టాలి. భవిష్యత్ అవసరాలను గుర్తించి సీతారామ ప్రాజెక్ట్ కాలువల మట్టిని జాగ్రత్తగా కాపాడుకోవాలి. ఇప్పటికే గుట్టల మట్టి మొత్తం తవ్వటంతో మట్టి కొరత ఏర్పడింది. రానున్న రోజులలో మట్టికి ఇంకా డిమాండ్ ఉంటుంది. ప్రభుత్వ అవసరాలకు మట్టిని నిల్వ ఉంచాలి.

– భూక్యా సాగర్, సారపాక

ప్రత్యేక నిఘా పెడుతున్నాం

సీతారామ మట్టిని అక్రమంగా తరలించే వ్యక్తులపై వాహనాలపై ప్రత్యేక నిఘా పెడుతున్నాం. ప్రభుత్వ అవసరాల కోసం అనుమతులు తీసుకుని వాడుకుంటే తప్ప అక్రమంగా మట్టిని తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటాం. మట్టి అక్రమ రవాణాపై టాస్క్‌ఫోర్స్, సీతారామ ప్రాజెక్ట్, పోలీస్, రెవెన్యూ యంత్రాంగం సంయుక్తంగా ఫోకస్ పెడుతున్నాం.

– భగవాన్‌రెడ్డి, తహసీల్దార్, బూర్గంపాడు

పునర్నిర్మాణమా.. రక్షణ చర్యలా?

- ముంపునకు గురికానున్న 'భగీరథ' ఇన్‌టెక్‌వెల్
- ప్రభుత్వానికి రెండు ప్రతిపాదనలు పంపిన అధికారులు



కుమ్మరిగూడెం గ్రామంలోని ఇన్‌టెక్‌వెల్

అశ్వాపురం: మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించే మండల పరిధిలోని కుమ్మరిగూడెం గ్రామంలోని మిషన్‌భగీరథ ఇన్‌టెక్‌వెల్ సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్‌లో నిర్మిస్తున్న కరకట్టతో ముంపునకు గురికానుంది. కుమ్మరిగూడెం నుంచి పాములపల్లి వరకు కరకట్ట నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మిషన్‌భగీరథ ఇన్‌టెక్‌వెల్ ప్రాంతంలో కరకట్ట నిర్మాణంపై జలవనరులశాఖ, మిషన్‌భగీరథ అధికారులు సంయుక్తంగా ఇటీవల పలుమార్లు పరిశీలనలు చేపట్టారు. ఇరుశాఖల అధికారులు పరిశీలనలు, సమాలోచనల అనంతరం సంయుక్తంగా రెండు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. ప్రస్తుతం ఉన్న ఇన్‌టెక్‌వెల్ ముంపునకు గురికాకుండా ఇంటెక్‌వెల్‌కు గోదావరికి మధ్య అడ్డుగా గోడ కట్టి రక్షణ చర్యలు చేపట్టడం, నూతనంగా ఇన్‌టెక్‌వెల్ నిర్మించడం రెండు ప్రతిపాదనలు పంపారు. రెండు ప్రతిపాదనలపై రెండు శాఖల ఉన్నతాధికారులు సమాలోచనలు జరుపుతున్నారు. ఇంకా స్పష్టత రాలేదు. ప్రభుత్వం నిర్ణయం మేరకు మిషన్‌భగీరథ ఇన్‌టెక్‌వెల్‌పై త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు. కొత్తగా నిర్మించాలంటే పునర్నిర్మాణం పూర్తయ్యాకనే ప్రస్తుతం ఉన్న ఇన్‌టెక్‌వెల్ తొలగించనున్నారు. గతంలో ఇన్‌టెక్‌వెల్ నిర్మాణానికి రూ.50 కోట్లు ఖర్చయింది. కరకట్టల నిర్మాణంలో మణుగూరు భారజల కర్మాగారానికి భారజలం ఉత్పత్తికి అవసరమైన నీరు అందించే ఇన్‌టెక్‌వెల్, మండల పరిధిలోని పాములపల్లి, కుమ్మరిగూడెం ఎత్తిపోతల పథకాలు కనుమరుగు కానున్నాయి. వీటిని నూతనంగా పునర్నిర్మించనున్నారు.

వైభవంగా శివాలయం వార్షికోత్సవం



స్వామి వారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో శ్రీ భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి వారి ఆలయ 16వ వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో గోపూజ, స్వామి వారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమం, స్వామి వారికి శాంతి కల్యాణాన్ని అర్చకులు కనుల పండుగగా జరిపించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ పునఃనిర్మాణకర్త మారగాని శ్రీనివాసరావు, ఎంపీటీసీ అయిలూరి కృష్ణారెడ్డి, బానావత్ భీముడు, ఇనపనూరి రాంబాబు, చల్లా రమేష్, ఇటికల హరి, సిబ్బంది పాల్గొన్నారు.

'యాత్ర' ప్రారంభం

అన్నపురెడ్డిపల్లి: హాత్‌సే హాత్ జోడో యాత్రను మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వనమా గాంధీ ఆధ్వర్యంలో ములకలపల్లి జెడ్పీటీసీ సున్నం నాగమణి ప్రారంభించారు. యాత్ర జయప్రదం కావాలని మండల కేంద్రంలోని శ్రీబాలాజీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. తుమ్మ రాంబాబు, చీకటి శ్రీను, దావా వెంకటరామయ్య, ఇనపనూరి జమలయ్య, చెరుకూరి ప్రసాద్ , గోళ్ల ముత్తయ్య, ఇనుగంటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ చైర్మన్‌కు సన్మానం

దమ్మపేట: దమ్మపేట ప్రెస్‌క్లబ్ చైర్మన్ చిక్కాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం ఆర్య వైశ్య సంఘం, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వాసవి భవన్‌లో పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యులు దారా యుగంధర్, నాయకులు అత్తులూరి వెంకటరామారావు, ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు పసుమర్తి వీరభద్రం, అత్యం శేఖర్, పసుమర్తి ముక్తేశ్వరరావు, వీరేశ్వరరావు, సోమేశ్వరరావు, సత్తిపండు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాటమే..

చర్ల: ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ రాజీలేని పోరాటాలను సాగిస్తుందని, ఈ పోరాటాలలో అన్నీ వర్గాలకు చెందిన ప్రజలు, ప్రజాస్వామిక వాదులు కలిసి రావాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కెచ్చెల రంగారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని శ్రీ శ్రీనివాస కల్యాణ మండపంలో పార్టీ మండల ప్రథమ మహాసభ నిర్వహించారు. ఈ మేరకు మండల పార్టీకి 11 మంది కార్యవర్గ సభ్యులతో పాటు పార్టీ మండల కార్యదర్శిగా కొండా చరణ్ ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి కెచ్చెల కల్పన, నాయకులు మధు, గౌస్, అరుణోదయ సమితి జిల్లా కార్యదర్శి రాంబాబు, మహిళా సంఘం, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సమగ్ర సర్వే



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

భద్రాచలం: పట్టణంలోని ప్రజా సమస్యలపై వార్డుల వారీగా సర్వే చేపడుతున్నట్లు సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కల్లూరి వెంకటేశ్వరరావు తెలిపారు. పార్టీ స్థానిక కార్యాలయంలో మంగళవారం లంకపల్లి విశ్వనాథ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సమస్యలు తెలుసుకున్నాక వాటి పరిష్కారం కోసం ఉద్యమాలు చేపడుతామన్నారు. కాగా, రాష్ట్ర బడ్జెట్‌లో గతంలో సీఎం ప్రకటించిన రూ.100 కోట్లు, ముంపు బాధితులకు ఇళ్ల నిర్మాణంపై స్పష్టత ఇవ్వకపోవడం సరికాదన్నారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి ఆకోజు సునీల్ కుమార్, నాయకులు బల్ల సాయికుమార్, మారెడ్డి శివాజీ, దారపునేని రమేష్, బత్తుల నర్సింహులు, మువ్వా రామలక్ష్మి, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలపై కళాజాత

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో ఆర్టీసీ సేవలపై కళాజాత బృందం సభ్యులు మంగళవారం కళాజాత నిర్వహించారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడం వలన కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ఆర్టీసీని ప్రజలు ఆదరించాలని కోరుతూ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో సిబ్బంది యంవి రావు, నభీ పాల్గొన్నారు.

జాతరకు సర్వం సిద్ధం



సిద్ధం చేసిన రంగుల రాట్నం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం గ్రామ శివారులోగల శ్రీ కట్టమైసమ్మ తల్లి ఆలయం వద్ద జాతర ఉత్సవాలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సర్వం సిద్ధం చేశారు. నేటి నుంచి ఈనెల 12 వరకు జరిగే జాతర ఉత్సవాల కోసం ఆలయం వద్ద, ప్రధాన రహదారికి ఇరువైపులా విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. ఉదయం గ్రామ తోరణాలు కట్టి, విఘ్నేశ్వ పూజలతో ఉత్సవాలను ప్రారంభిస్తారు. ఈ ఉత్సవాలకు భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలిరానున్నారు. భక్తులకు ఏలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టారు.

ఏసీడీ చార్జీలు ఉపసంహరించుకోవాలి



మణుగూరు రూరల్: ధర్నా చేస్తున్న నాయకులు



బూర్గంపాడు: విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఆందోళన..

మణుగూరు రూరల్: విద్యుత్ వినియోగదారులపై అదనంగా పడుతున్న ఏసీడీ చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సీపీఐ ఆధ్వర్యంలో విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య మాట్లాడుతూ... ఏసీడీ చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఈ వేణుగోపాల్‌కు వినతపత్రం అందజేశారు. పార్టీ మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి, ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు లక్ష్మీనారాయణ, మండల కార్యదర్శి జంగం మోహన్‌రావు, సర్వర్, నర్సింహరావు, కుటుంబరావు, బాడిశ సతీష్ , లక్ష్మయ్య పాల్గొన్నారు.

బూర్గంపాడు: ఏసీడీ విద్యుత్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ ఆధ్వర్యంలో సారపాక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. సీపీఐ మండల కార్యదర్శి మువ్వా వెంకటేశ్వరరావు, నాయకులు పేరాల శ్రీనివాస్, అలవాల సీతారామిరెడ్డి, సుబ్బారెడ్డి, పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న కార్మికులు

మణుగూరుటౌన్: మణుగూరు మున్సిపాలిటీలో కార్మిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇఫ్టూ, సీఐటీయూ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయం గేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఎండి.గౌస్, ఉప్పతల నర్సింహరావులు మాట్లాడుతూ... 11వ పీఆర్‌సీలో పెరిగిన వేతనాలు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కార్పొరేట్లు, మున్సిపాలిటీల్లో అమలు జరుగుతున్నా మణుగూరు మున్సిపాలిటీలో అమలుకు నోచుకోలేదన్నారు. కమిషనర్ల దృష్టికి తీసుకుపోయినా తమ సమస్యను ఎవరు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రభుత్వం స్పందించి తమకు న్యాయమైన వేతనాలు ఏరియర్స్ చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు రాజేందర్, బత్తుల వెంకటేశ్వర్లు, పల్లపు నాగేశ్వరరావు, లక్ష్మినారాయణ, పద్మ, పి నర్సింహారావు, రమాదేవి, దుర్గయ్య, చంద్రయ్య, సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

మణుగూరుటౌన్: మణుగూరు మండల కేంద్రంలో మంగళవారం మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ తిరుపతిరావు సారథ్యంలో తోగ్గుడెం సమ్మక్క సారలమ్మ ఆలయ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రతీ వాహనానికి పత్రాలు ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు వాహన ఫిట్‌నెస్ చేయించుకోవాలన్నారు. నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపాలని, అధిక లోడ్ వేయొద్దన్నారు.

దాడి కేసు నమోదు

దమ్మపేట: అసభ్య పదజాలంతో దూషిస్తూ, భౌతిక దాడికి పాల్పడిన ఘటన మండల పరిధిలోని మందలపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మందలపల్లి గ్రామానికి చెందిన రేగళ్ల సుజాతను సోమవారం భూ వివాదం కారణంగా అదే గ్రామానికి చెందిన రేగళ్ల నాగేశ్వరరావు, రేగళ్ల మధు అసభ్య పదజాలంతో దూషించి సుజాత దంపతులను కర్రలతో కొట్టి చంపుతామని బెదిరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

'కంటి వెలుగు' ప్రారంభం

దమ్మపేట: కంటి వెలుగు కార్యక్రమాన్ని మండల పరిధిలోని బాలరాజుగూడెం గ్రామంలో మంగళవారం జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కంటి పరీక్షల అనంతరం కొంత మందికి వెంటనే కళ్ల అద్దాలను ప్రజా ప్రతినిధుల సమక్షంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సోయం ప్రసాద్, సర్పంచ్ శ్రీనివాస్, కంటి వెలుగు సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మహిళల వినతి



వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

అశ్వారావుపేట: గుర్రాలచెరువు గ్రామపరిధిలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన మహిళలు మంగళవారం ఆర్‌ఐ కృష్ణకు వినతిపత్రం సమర్పించారు. సోమవారం మహిళలు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎండబ్ల్యూవో సంజీవ రావు మంగళవారం అశ్వారావుపేట వచ్చారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద వారితో మాట్లాడి వారం రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీపీ అధ్యక్షుడు జల్లిపల్లి శ్రీరామూర్తిని కలిసి ఉపాధి హామీ వేతనాలు రావడంలేదన్నారు. కాంతమ్మ, పుష్ప, సునిత, సంధ్య, లక్ష్మి, సంకురాత్రి సతీష్, శ్రీను, యారా నాగేశ్వరరావు, నాగేంద్ర పాల్గొన్నారు.

కార్మికుల అరెస్టు

కరకగూడెం: మిషన్ భగీరథలో పనిచేస్తున్న కార్మికులు వారి సమస్యల పరిష్కారాం కోసం సీఐటీయు ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న కార్మికులను మంగళవారం అక్రమంగా అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కమిటీ నాయకులు కొమరం కాంతారావు ప్రభుత్వం చేసిన ఈ చర్యను పూర్తిగా ఖండిస్తు నిరసనకు దిగారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు, మిషన్ భగీరథ కార్మికులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు



దుమ్ముగూడెం: అవగాహన కల్పిస్తున్న వైద్యులు

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో కే రేగుబల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆర్లగూడెం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయుర్వేద డాక్టర్ ఉషారాణి ఆయుర్వేదంపై అవగాహన కల్పించారు. ఆయుష్ కర పత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నేచురోపతి డాక్టర్ జ్యోతి, ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, ఉపాధ్యాయులు, పారామెడికల్ సిబ్బంది కందుల వీరభద్రం పాల్గొన్నారు.

చంద్రుగొండ : మండలంలోని బెండాలపాడు శివారు గుత్తికోయగూడెంలో ఆదివాసీలకు చంద్రుగొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ తనుజా వివరించారు. చిన్నపిల్లలను, వృద్ధులను వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. హెల్త్ అసిస్టెంట్‌లు ఇమాం, శ్రీనివాస్, సిబ్బంది సుజాత, పద్మ, రాజేశ్వరి, నాగమణి, విజయకుమారి పాల్గొన్నారు.

కరకగూడెం: మండల పరిధిలోని చొప్పాల గ్రామంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని సర్పంచ్ జివ్వాజి రాధ ప్రారంభించారు. వైద్యాధికారి సీహెచ్ కుమార స్వామి గ్రామస్తులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఎంఎస్‌ఓ శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చంద్రుగొండ : చిన్నారులతో వైద్య సిబ్బంది



కరకగూడెం: పరీక్షిస్తున్న వైద్యాధికారి

అటెన్షన్ ప్లీజ్

మట్టిలో కలిసిపోతున్న స్క్రాప్



సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని ఆటో వర్క్‌షాపు వద్ద ఎంతో విలువైన స్క్రాప్ అధికారుల నిర్లక్ష్యంతో మట్టిలో కలిసిపోతుందని సింగరేణి కార్మికులు వాపోతున్నారు. సింగరేణిలో చిన్నచిన్న విషయాలను ఎంతో పెద్దగా చూపెట్టే అధికారులు ఇక్కడ ఎంతో విలువైన స్క్రాప్ ఈవిధంగా మూలన పడేసి పట్టించుకోకపోవడం దారుణమంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే వాటిని మట్టిలో కలువకుండా చూడాలని కోరుతున్నారు. – మణుగూరుటౌన్

ప్రశ్నించాల్సిన అధికారి : డి.లలిత్‌కుమార్, ఏరియా ఎస్వోటూ జీఎం, మణుగూరు
సెల్ నంబర్ : 9491145032